www.mb9news.in
R.NO : TS-11-0011054
# మన భద్రాద్రి న్యూస్
మన అక్షరం ....... ప్రజల ఆయుధం
డిజిటల్ తెలుగు దినపత్రిక
శనివారం 29, మార్చి 2025

## ఐఆర్‌సీటీసీ స్పెషల్ ప్యాకేజీ తో హాయిగా శ్రీవారి దర్శనం..!

- శ్రీవారి భక్తుల కోసం ఐఆర్‌సీటీసీ స్పెషల్ ప్యాకేజీ




5 లో..

# రేవంత్ సర్కార్ సంచలన నిర్ణయం..!

## రాష్ట్రవ్యాప్తంగా 6,729 మంది ఉద్యోగుల తొలగింపు..!



2 లో..

హైదరాబాద్, మన భద్రాద్రి బ్యూరో, మార్చి 28

తెలంగాణలో అటెండర్ నుంచి ఐఏఎస్ ల వరకు 6,729 మంది ఉద్యోగులను తొలగిస్తూ రేవంత్ సర్కార్ సంచలన నిర్ణయం తీసుకుంది. పదవీ విరమణ అనంతరం కాంట్రాక్టుపై కొనసాగుతున్న ఉద్యోగులను తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రేవంత్ సర్కార్ నిర్ణయంతో ఓవైపు నిరుద్యోగులకు గ్రూప్-1 నుంచి గ్రూప్-4 వరకు ఉద్యోగ అవకాశాలు రానుండగా.. మరోవైపు సీనియర్ ఉద్యోగులకు ప్రమోషన్లు దక్కనున్నాయి.

## గల్ఫ్ మృతుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా విడుదల




2 లో..

## కాంగ్రెస్ పార్టీ ఇకనైనా నిజాలు మాట్లాడాలి

- ఎమ్మెల్సీ కవిత ఘాటు వ్యాఖ్యలు



2 లో..

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ పెంపు

- 2 శాతం పెంపునకు కేంద్ర కేబినెట్ ఆమోదం
- 53 శాతం నుంచి 55 శాతానికి పెరగనున్న డీఏ
- చివరి సారిగా 2024 జూలైలో డీఏ పెరుగుదల




2 లో..

# కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకృతిని నాశనం చేస్తుంది

## - మాజీ మంత్రి కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్, మన భద్రాద్రి బ్యూరో, మార్చి 28

తెలంగాణ రాష్ట్రంలో భూ వ్యవహారాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కంచే- గచ్చిబౌలిలో 400 ఎకరాల ప్రభుత్వ భూమిని విక్రయించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే, ఈ నిర్ణయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రభుత్వ భూములను ప్రైవేట్ వాణిజ్య ప్రయోజనాల కోసం విక్రయించడం సరైన చర్య కాదని, ఇది పర్యావరణానికి, నగర అభివృద్ధికి హాని కలిగిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.



5 లో..

# రేవంత్ సర్కార్ సంచలన నిర్ణయం..!

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగ వ్యవస్థలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. పదవీ విరమణ అనంతరం కాంట్రాక్టుపై కొనసాగుతున్న 6,729 మంది ఉద్యోగులను తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఉత్తర్వుల ప్రభావం అటెండర్ స్థాయి నుంచి ఐఏఎస్ అధికారుల వరకు ఉండనుంది. ముఖ్యంగా మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్ రావు, కన్సల్టెంట్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, ట్రాన్స్కో, జెన్‌కో డైరెక్టర్లు ఈ జాబితాలో ఉన్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి నెలాఖరుకల్లా తొలగింపు ప్రక్రియ పూర్తి కావాలని.. అవసరమైతే కొత్త నోటిఫికేషన్ జారీ చేసి మళ్లీ నియామకాల అవకాశాన్ని పరిశీలించవచ్చని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులలో పేర్కొంది.

ఈ ఉత్తర్వులు అందిన వెంటనే మున్సిపల్ శాఖ 177 మంది ఉద్యోగులను వెంటనే తొలగించింది. హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, హైదరాబాద్ వాటర్ వర్క్స్, మెట్రో రైల్, రెరా, మెప్మా, కుడా, వైటీడీఏ విభాగాలలోని ఉద్యోగులను కూడా తొలగించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, డిప్యూటీ కలెక్టర్లు, అటవీ శాఖ అధికారులు, ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు వంటి



అనేక స్థాయిల్లో ఉన్న ఉద్యోగులపై ప్రభావం చూపనుంది. తెలంగాణ ప్రభుత్వం ఇతర శాఖల్లో కూడా తొలగింపుల చేపట్టే సూచనలు కనిపిస్తున్నాయి.

విద్యుత్ శాఖలో మరికొందరు డైరెక్టర్లను తొలగించే అవకాశం ఉంది. నీటిపారుదల శాఖలో ఇప్పటికే 200 మందికి పైగా ఉద్యోగుల తొలగింపు జరిగింది. పోలీసు శాఖలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం వెలుగులోకి రావడంతో గతంలోనే తొలగింపులు జరిగాయి. రెవెన్యూ, దేవదాయ, ఆర్అండ్‌బీ, విద్యాశాఖ, బీసీ సంక్షేమం, రవాణా, ఎక్సైజ్, వాణిజ్య పన్నులు వంటి కీలక విభాగాల్లో మార్పులు ఉండవచ్చు.

ప్రభుత్వ చర్యతో ఉద్యోగ నియామకాల కోసం ఆరు వేలకుపైగా కొత్త అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం గ్రూప్ వన్ నుంచి గ్రూప్ ఫోర్ వరకు కొత్త నోటిఫికేషన్లపై చర్చ జరుగుతోంది. కాంట్రాక్టుపై కొనసాగుతున్న కారణంగా పదోన్నతులు ఆలస్యమయ్యాయని ఉద్యోగ సంఘాల నుంచి అభిప్రాయం వ్యక్తమవుతోంది. తాజా ఉత్తర్వులతో ఉద్యోగులకు పదోన్నతుల అవకాశాలు విస్తరించనున్నాయి. ప్రభుత్వం పదవీ విరమణ అనంతరం కాంట్రాక్టుపై కొనసాగుతున్న 6729 మంది ఉద్యోగులను తొలగించినప్పటికీ అత్యవసరంగా 100 మందికి మాత్రమే తిరిగి అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మెట్రో రైల్ ప్రాజెక్ట్‌కు ఎన్వీఎస్ రెడ్డికి తిరిగి అవకాశం ఇవ్వచ్చని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఈ నిర్ణయం ద్వారా ప్రభుత్వ ఖజానాపై భారం తగ్గనుంది. కాంట్రాక్టు ఉద్యోగుల స్థానంలో కొత్త నియామకాలు చేపట్టేందుకు మార్గం సుగమం అవుతోంది. పదోన్నతులు నిలిచిపోవడంపై ఉద్యోగుల నుంచి వచ్చిన అసంతృప్తిని తొలగించేందుకు వీలయ్యే అవకాశం కూడా ఉంది. మరోవైపు కాంట్రాక్టు ఉద్యోగులను ఒక్కసారిగా తొలగించడంపై ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. మొత్తానికి రేవంత్ రెడ్డి సర్కార్ తీసుకున్న ఈ సంచలన నిర్ణయం అటు ఉద్యోగ నియామకాలపై ఇటు రాజకీయ పరిణామాలపై దీర్ఘకాలంలో ప్రభావాన్ని చూపే అవకాశం ఉంది.

# కాంగ్రెస్ పార్టీ ఇకనైనా నిజాలు మాట్లాడాలి

**హైదరాబాద్, మన భద్రాద్రి బ్యూరో, మార్చి 28**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిందని, ఇకనైనా నిజాలు మాట్లాడాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సూచించారు. కాంగ్రెస్ తాము ఇన్నాళ్లు చెప్పినవి అబద్ధాలు అని ఒప్పుకుంటే మర్యాదగా ఉంటుందని అన్నారు. శాసనమండలిలో ఇవాళ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీల విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడారు. అప్పులపై కాంగ్రెస్ నేతల తప్పులు బయటపడ్డాయని అన్నారు.

రాష్ట్రం అప్పులు మొత్తం రూ.4.42 లక్షలుగా పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని,

కానీ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం రూ.8 లక్షల కోట్లు అప్పులున్నాయని దుష్ప్రచారం చేస్తున్నారని కవిత విమర్శించారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా నిజాలు చెప్పాలని అన్నారు. అబద్దాలు చెబుతున్నామని కాంగ్రెస్ పార్టీ ఒప్పుకుంటే మర్యాదగా ఉంటుందని సూచించారు. కాళేశ్వరం బ్యారేజీలు కూలిపోతాయన్నదానిలో వాస్తవం లేదని, స్వయంగా ఇరిగేషన్ మంత్రి మండలిలో ఈ విషయం చెప్పారని అన్నారు.

'నీళ్లు ఇవ్వగలిగి ఇవ్వకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం కాదా..?' అని కవిత ప్రశ్నించారు. ప్రజా క్షేత్రంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామని చెప్పారు. ఏప్రిల్ 27న ఎల్కతుర్తి వద్ద బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ జరుగుతుందని ఆమె తెలిపారు. మహాకుంభమేళా తరహాలో సభను నిర్వహిస్తామని అన్నారు. ఇరవై ఐదు వసంతాల బీఆర్ఎస్ పార్టీ ఉత్సవాల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని కవిత పిలుపునిచ్చారు. శాసనమండలిలో బీఆర్ఎస్ ప్రజల గొంతుకగా వ్యవహరించిందని అన్నారు.

సమన్వయంతో అన్ని అవకాశాలను వాడుకొని ప్రభుత్వాన్ని ప్రశ్నించామని, అన్ని చర్చల్లో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టామని కవిత చెప్పారు. ప్రజలు, రైతులు, మహిళలు ఇలా అన్ని వర్గాల సమస్యలపై గళమెత్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రతి రోజూ వినూత్న రీతిలో నిరసనలు తెలిపామని గుర్తుచేశారు. కేసీఆర్‌పై ముఖ్యమంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలపై కూడా సభలో నిరసన తెలిపామని అన్నారు.

ఫీజు రీయింబర్స్ మెంట్‌పై తాము చేసిన పోరాటానికి ప్రభుత్వం దిగొచ్చిందని, ఎప్పటికప్పుడు ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను విడుదల చేస్తామని మండలి సాక్షిగా ముఖ్యమంత్రి ప్రకటించారని చెప్పారు. ప్రకటించిన విధంగా సీఎం ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను విడుదల చేసేవరకు తాము ప్రశ్నిస్తూనే ఉంటామని కవిత అన్నారు. ఈ మండలి సమావేశాలు రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతాయని, ఈ సమావేశాల్లోనే బీసీ రిజర్వేషన్ల బిల్లులు, ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందాయని తెలిపారు.

ఆ బిల్లుల ఆమోదానికి బీఆర్ఎస్ పార్టీ కృషి ఫలితం ఎంతో ఉందన్నారు. అసెంబ్లీ సాక్షిగా మహిళలను ఉద్దేశించి పరుష పదజాలంతో ముఖ్యమంత్రి అసభ్యంగా మాట్లాడారని, ఆ వ్యాఖ్యలు ఆయన చరిత్రలో మరకగా ఉండిపోతాయని అన్నారు.

# నిరుద్యోగులు స్వయం శక్తితో ఉపాధి కల్పించుకోవాలి

**- ఐటీడీఏ పీవో బి రాహుల్**

**భద్రాచలం, మన భద్రాద్రి బ్యూరో, మార్చి 28**

పై చదువులు చదువుకొని ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం శక్తితో ఉపాధి కల్పించుకోవడానికి నిరుద్యోగులైన గిరిజన యువకులు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకొని జీవనోపాధి పెంపొందించుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు.

శుక్రవారం నాడు ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో ట్రైకర్ గ్రామీణ రవాణా పథకం కింద అర్హులైన నిరుద్యోగ గిరిజన యువకులకు మంజూరైన టాటా ఏంట్రా వి 30 జోష్ బ్లూ 6 వాహనాలను పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ట్రైకర్ గ్రామీణ రవాణా పథకంలో భాగంగా పాల్వంచ మండలంకు చెందిన జరపల లాల్ సింగ్, యూనిట్



కాస్ట్ 8,31,455 రూపాయలు కాగా సబ్సిడీ కింద 2,88,000 పోను బ్యాంకు రుణము 4,38,280 రూపాయలు అందించారని, బెనిఫిషర్ కంట్రిబ్యూషన్ 1,05,175 రూపాయలతో టాటా ఏంట్రా వి 30 జోష్ బ్లూ బిఎస్ 6 వాహనాలు అందించడం జరిగిందని, అలాగే టేకులపల్లి మండలం కు చెందిన బానోత్ అశోక్ కుమార్ యూనిట్ కాస్టు 8,31,455 కాగా, 2,88,000 సబ్సిడీ మరియు బెన్ఫిషర్ కంట్రిబ్యూషన్ 1,05,175 బ్యాంకు రుణము 4,38,280 అందించడంతో టాటా ఏంట్రా వి 30 జోష్ బ్లూ బిఎస్ 6 వాహనము కొనుగోలు చేశారని ఆయన అన్నారు. వాహనాలు తీసుకున్న లబ్ధిదారులు వాహనాలు ఖాళీగా ఉంచకుండా మీ గ్రామాలలో సీజన్లను బట్టి వడ్లు పత్తి మరియు పాల వ్యాపారాలకు సంబంధించిన రవాణా సౌకర్యం కల్పించుకొని జీవనోపాధి పెంపొందించుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఇన్చార్జియస్ఓ భాస్కర్, డిఎస్ఓ ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.



# కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ పెంపు

**మన భద్రాద్రి వెబ్ డెస్క్, మార్చి 28**

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్. ఉద్యోగుల కరువు భత్యం (డీఏ)ను 2 శాతం మేర పెంచుతూ కేంద్ర మంత్రి వర్గం నిర్ణయం తీసుకుంది. ఈ పెంపుతో ప్రస్తుతం 53 శాతం ఉన్న డీఏ 55 శాతానికి పెరగనుంది. దీంతో ఉద్యోగుల జీతాలు కూడా పెరగనున్నాయి. కేంద్ర ప్రభుత్వం చివరి సారిగా నిరుడు జూలైలో డీఏను పెంచారు. అప్పట్లో 50 శాతం ఉన్న డీఏ 53 శాతానికి పెరిగింది. పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని తట్టుకునేందుకు గాను ప్రభుత్వ ఉద్యోగులకు డీఏను ఇస్తాను. ఎప్పటికప్పుడు ఈ డీఏను సవరిస్తూ ఉంటారు. ప్రతీ ఏడాది రెండు సార్లు కరువు భత్యాన్ని సవరిస్తూ ఉంటుంది. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా డీఏను పరిహారంగా ఇస్తుంటారు. డీఏ పెంపు వల్ల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లకు లబ్ది చేకూరనుంది. దేశవ్యాప్తంగా ఉన్న 48.66 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 66.55 లక్షల మంది పెన్షనర్లకు ప్రయోజనం జరుగుతుంది. హెూలీకి ముందే కేంద్ర ప్రభుత్వం డియర్నెస్ అలవెన్స్, డియర్నెస్ రిలీఫ్ పెంపును ప్రకటిస్తుందని వార్తలు వచ్చాయి. అయితే కాస్త ఆలస్యంగా కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్లకు గుడ్ న్యూస్ తెలిపింది. ఆల్ ఇండియా కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ఫర్ ఇండస్ట్రియల్ వర్కర్స్ (ఏఐసీపీఐ-ఐడబ్ల్యూ) డేటా ఆధారంగా డీఏ రేట్‌ను నిర్ణయిస్తారు. ఏదైనా సవరణ నిర్ణయం తీసుకునే ముందు ప్రభుత్వం గత ఆరు నెలల గణాంకాలను తీసుకొని అంచనా వేస్తుంది. కాగా, జనవరి 1 నుంచి పెరిగిన డీఏ వర్తిస్తుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

## గల్ఫ్ మృతుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా విడుదల

**హైదరాబాద్, మన భద్రాద్రి బ్యూరో, మార్చి 28**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు 66 మంది గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ప్రభుత్వం శుక్రవారం రూ.3 కోట్ల 30 లక్షల ఎక్స్ గ్రేషియాను వారి బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేశారని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అనిల్ ఈరవత్రి ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం సూచన మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (ఆర్థిక, ప్రణాళిక) కే.రామక్రిష్ణా రావుతో సమన్వయము చేసి నిధులు విడుదల చేయించానని అనిల్ తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో 28 మంది, జగిత్యాల 19, కామారెడ్డి 9, నిర్మల్ 7, మెదక్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలలో ఒక్కొక్కరి చొప్పున 66 మంది ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయని వివరించారు. గతంలో 103 మందికి రూ.5 కోట్ల 15 లక్షలు విడుదల చేశారని తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 169 మందికి రూ.8 కోట్ల 45 లక్షలు చెల్లింపు జరిగిందని అనిల్ వివరించారు.

## ప్లాస్టిక్ విక్రయిస్తే సహించేది లేదు

**- సారపాక పంచాయతీ సెక్రటరీ మహేష్**

**బూర్గంపహాడ్, మన భద్రాద్రి బ్యూరో, మార్చి 28**

బూర్గంపహాడ్ మండల పరిధిలోని మేజర్ గ్రామ పంచాయతీ సారపాకలో సెక్రెటరీ మహేష్ సింగిల్ యూస్ ప్లాస్టిక్ పై ఉక్కు పాదం మోపారు. ఈ నేపథ్యంలో శుక్రవారం తన సిబ్బందితో పాటు వావ్ స్వచ్ఛంద సంస్థ సిబ్బందితో కలిసి వ్యాపార దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. గతంలో తనిఖీలు నిర్వహించి పలు దుకాణదారులకు నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో పలుచోట్ల ఉన్నటువంటి ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకొని మరోసారి విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ క్రమంలో ఐటిసి ఈశ్రీ ఫౌండేషన్ వావ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రోజా దుకాణదారులకు సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తూ ప్లాస్టిక్ కవర్ల తయారీలో కలిపే రంగులలో క్యాన్సర్ కారకాలు ఉంటాయని, వాటి ద్వారా ఆహార పదార్థాలు కలుషితమై క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. పిల్లలు తాగే పాల బాటిల్ లో ప్లాస్టిక్ వాడడం వలన పలు రకాలైన ఆరోగ్య సమస్య తలెత్తుతున్నాయని తెలిపారు. ప్లాస్టిక్ ఆట వస్తువులు సైతం పిల్లల అనారోగ్యానికి కారకాలని వాటి ద్వారా పిల్లల్లో నాడీ వ్యవస్థ, మానసిక ఎదుగుదలలో లోపాలు తలెత్తుతాయని అన్నారు. ప్లాస్టిక్ కు బదులు కాగితపు సంచులు, స్టైయిన్ లెస్ స్టీల్, ఇత్తడి, రాగి వస్తువులను వాడితే ఉపయోగకరమని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, వావ్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# అధికారులకు ప్రసాదాలను అందజేసిన స్వామీజీ, గుండాల ఎంపీటీసీ

**– గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకట రామిరెడ్డి**






**ఎటపాక, మన భద్రాద్రి బ్యూరో, మార్చి 28**

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి సన్నిధికి అతి సమీపంలో ఉన్న ఉష్ణ గుండాల ప్రాంతంలో ఈ నెల 12 నుంచి 23 వరకు శ్రీ అష్టలక్ష్మి యాగాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించడం జరిగింది. లోక కళ్యాణం కోసం నిర్వహించిన ఈ మహా కార్యక్రమంలో శ్రీ పీతాంబరం రఘునాథ చార్య స్వామీజీ వారి ఆధ్వర్యంలో భక్తులందరికీ చక్కని ఆరోగ్యం, మంచి ఆయుషు, ఆర్థిక వనరులు, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని తలపెట్టిన ఈ మహాయాగం కార్యక్రమం విజయవంతం కావడం జరిగింది. స్వామీజీ మరియు స్థానిక గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకట్రామిరెడ్డి కలసి ఎటపాక మండల అధికారులు అందరికీ కూడా అమ్మవారి ఫోటో ఫ్రేమ్ మరియు ప్రసాదాలను అందించి వారందరికీ కూడా స్వామీజీ అమ్మవారి మంగళ శాసనాలను ఇవ్వడం జరిగింది. అంతేకాకుండా ఈ మహాయాగం కార్యక్రమం కోసం పాటుపడినటువంటి యాగ కమిటీ సభ్యులైన నక్కా భాస్కరరావు, గాదె మాధవరెడ్డి, గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకట రామిరెడ్డి, కంభంపాటి సురేష్ మరియు అష్టలక్ష్మి దీపిక వైభవ కమిటీ సభ్యులందరినీ మరియు ఈ కార్యక్రమానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయపడిన వారందరికీ కూడా స్వామీజీ గారు వారందరికీ కూడా మంగళ శాసనాలను ఇవ్వడం జరిగింది.

# పగడాల మృతికి మండల పాస్టర్ ఫెలోషిప్ శాంతి ర్యాల



**అశ్వారావుపేట, మన భద్రాద్రి న్యూస్, మార్చి 27**

మార్చి 25 వ తేదిన మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి నిరసనగా శాంతి ర్యాలీ నిర్వహించిన అశ్వారావుపేట మండల పాస్టర్స్. ఈ కార్యక్రమంలో మండలములోని పాస్టర్స్ అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రవీణ్ పగడాల వారి మృతికి నిరసన తెలియజేస్తూ వారు మంచి సేవకులు అని వారి బోధనలో అనేక మందిని వారి యొక్క ప్రసంగాలు ద్వారా అనేకమంది ప్రోత్సహించబడ్డారని, ఉన్నది ఉన్నట్టుగా ప్రజలకు చెప్పి సత్యమార్గంలో నడిపించిన ఒక మంచి దేవుని సేవకుని కోల్పోయామని ఈ అకస్మిక మరణం చాలా వేదనకరమని ఆయన మృతికి సంబంధించి పూర్తి వివరాలు తెలియవలసి ఉందని రెండు రాష్ట్రాల ప్రభుత్వం వారు మంచి న్యాయం చేయాలని రెండు రాష్ట్రాల్లో ఉన్నటువంటి పాస్టర్స్ కు రక్షణ కల్పించాలని యేసుక్రీస్తు అందరికీ ప్రభువు అని ప్రకటించే సేవకులకు వారి కుటుంబాలకు రక్షణ కల్పించి ఎటువంటి దాడులు జరగకుండా చూడాలని రెండు రాష్ట్రాల ముఖ్య మంత్రి వర్యులు క్రైస్తవులకు న్యాయం చేయాలని మండల పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ గుబ్బల సుజీవరాజు ప్రొఫెసర్ దోనే శివాజీ ,లాయర్ లావణ్య ,ఫెలోషిప్ సెక్రటరీ కుంజా కిరణ్ ,వైస్ ప్రెసిడెంట్ .కే వరప్రసాద్ మరొక వైస్ ప్రెసిడెంట్ .పి ప్రభుదాస్ యూటీఎం. ప్రెసిడెంట్ ,పాయం స్టీవెన్ దొర, సలహాదారులు , వెలుగు జాకబ్, జి జె నెహ్రూ, ఎం మార్కు రాజ్ ,కొడమంచిలి సుధాకర్ స్థానిక సంఘ పాస్టర్లు సంఘస్తులు మరియు యువకులు, యువతులు పెద్ద ఎత్తున తదితరులు పాల్గొన్నారు..

# చతిస్గఢ్ లో ఆపరేషన్ కగార్ ను నిలిపివేయాలి



**ఇల్లందు, మనభద్రాద్రి న్యూస్, మార్చి 28**

చత్తీస్గడ్ లో ఆపరేషన్ కగార్ ను నిలిపివేయాలని ఏప్రిల్ 8న హైదరాబాదులో సిపిఐ(ఎం-ఎల్)న్యూ డెమోక్రసీ నిర్వహించే ప్రజా ధర్నాను విజయవంతం చేయాలని ముద్రించిన వాల్పోస్టర్లను శుక్రవారం ఇల్లెందు బుగ్గవాగు వంతెన సమీపంలోని భగత్ సింగ్ సెంటర్లో ఆవిష్కరించడం జరిగింది.సిపిఐ (ఎం-ఎల్)న్యూ డెమోక్రసీ ఇల్లెందు డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అవునూరి మధు,ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం జాతీయ కన్వీనర్ ముక్తి సత్యం పాల్గొని మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరిట ఆదివాసి జాతి హననానికి బిజెపికి చెందిన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎడతెగని విధంగా హత్యాకాండ కు తెగబడుతున్నాయని అన్నారు.చత్తీస్గడ్ రాష్ట్రంలో వందలాది మందిని ఎన్కౌంటర్ల పేరిట హత్య గావిస్తున్నారని విమర్శించారు.ఈ హత్యకాండను ప్రత్యేకించి ఆదివాసి జాతిని స్వదేశీ,విదేశీ కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసం హతమారుస్తున్న విధానాన్ని దేశంలోని రాజకీయ పార్టీలు ప్రజాసంఘాలు,మేధావులు, ఆలోచనపరులు తీవ్రంగా వ్యతిరేకించి ఖండించాలని అన్నారు.ఏప్రిల్ 8న హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే ప్రజాధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు ఐ.క్రిష్ణ,ఎం.శ్రీనివాస్, ఏ ఐ టి ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ సూర్ణపాక నాగేశ్వరరావు, ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు కొక్కు సారంగపాణి,సిపిఐ (ఎం-ఎల్)న్యూ డెమోక్రసీ ఇల్లందు పట్టణ కార్యదర్శి ఎం డి.రాసుద్దీన్,పివైఎల్ రాష్ట్ర అధ్యక్షులు మోకాళ్ళ రమేష్, ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు తోడేటి నాగేశ్వరరావు, అరుణోదయ జిల్లా కార్యదర్శి ఎనగంటి చిరంజీవి,ఐ ఎఫ్ టి యు జిల్లా నాయకులు డి. మోహన్ రావు, ఎం.మల్లికార్జున రావు, ఎల్.మారుతీ రావు, యనగంటి రమేష్ తదితరులు, పాల్గొన్నారు.

# రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా చంద్ర

**జూలూరుపాడు, మన భద్రాద్రి న్యూస్, మార్చి 28**



తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా చంద్ర నరేంద్ర కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 25, 26, 27 తేదీలలో నిజామాబాద్ పట్టణంలో జరిగిన రాష్ట్ర రైతు సంఘం మూడవ రాష్ట్ర మహాసభలో ఈ మేరకు ఎన్నుకున్నారు, 109 మందితో నూతన రాష్ట్ర కమిటీని 21 మంది నూతన ఆఫీస్ బేరర్లుగా ఎన్నికైనట్లు తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు రైతాంగం హీనమైన పరిస్థితిలోకి నెట్టి వేయబడుతున్నారని, పాలకప్రభుత్వాల దివాలాకోరు రాజకీయ విధానాలతో రైతులు ఆత్మహత్యల పాలు అవుతున్న ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని ఆయన అన్నారు, అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతాంగానికి దేశవ్యాప్తంగా ఉన్న ఏడు లక్షల కోట్లరుణం మాఫీ చేయడానికి కుంటి సాకులు చెబుతున్న కేంద్ర ప్రభుత్వం మోడీ అధికారంలోకి వచ్చాక 16.5 లక్షల కోట్లు కార్పొరేట్ కంపెనీలకు ఋణాలు రైట్ ఆఫ్ చేసి వాళ్ళఎగవేతకు దోహదపడ్డాడని, 758 మంది రైతులు ప్రాణత్యాగం చేసి వేలాది మంది రైతులు ఢిల్లీని ముట్టడించి నల్ల చట్టాల రద్దు చేయిస్తే, మళ్లీ జాతీయ మార్కెట్ విధానం పేరుతో దొడ్డిదారిన ప్రవేశపెట్టాలని చూస్తుందని అయినా ఈ సందర్భంగా తెలియజేశారు.

# నిరుపేదలకు న్యాయం జరిగే వరకూ మేము పోరాటం చేస్తాం

**–బీజేపీ బిజెఏఎంసి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మద్దిశెట్టి సామేలు**

**చంద్రుగొండ, ,మన భద్రాద్రి న్యూస్ మార్చి 28**

చంద్రుగొండ మండల పరిధిలోని దామరచర్ల గ్రామంలో శుక్రవారం ఎస్ఆర్ గార్డెన్ లో మద్దిశెట్టి సామేలు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఏజెన్సీ లో ఉన్న నిరుపేదల కనీస అవసరాలు ఇండ్లు, రేషన్ కార్డులు, మంచినీటి సౌకర్యం, గిరిజన గ్రామాలకు బీటి, సిసి రోడ్లు, గిరిజన మహిళ పూజారులకు వేతనాలు, గిరిజన దేవాలయాలకు దీప దూప నైవేద్యాలు కోసం నిధులు మంజూరు చేయాలని బిజెపి బిజెఎంసి ఆధ్వర్యంలో గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వాలపై నిరంత పోరాటాలు నిర్వహించడం జరిగిందన్నారు.ఏజెన్సీ లో ఉన్న నిరుపేదలకు కనీస అవసరాలు తీరేంతవరకు తమ పోరాటం ఆగదని ఆయన అన్నారు. శుక్రవారం అందులో భాగంగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం గుర్తించి వెంటనే ఏజెన్సీ లో ఉన్న నిరుపేదలకు కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వానికి ఆదేశాలు కూడా ఇవ్వడం జరిగిందన్నారు.ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న గిరిజనులకు న్యాయం జరిగేంత వరకు తమ పోరాటాలు నిరంతరం కొనసాగుతూనే ఉంటాయన్నారు. నేడు దామరచర్ల గ్రామంలోని ఎస్ఆర్ గార్డెన్ లో ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 39 మండలాల నుంచి మండలానికి 100 మంది చొప్పున 4000 మందితో భారీ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎస్ పవార్ బిజెపి బిజెఎంసి జాతీయ ప్రధాన కార్యదర్శి మరియు దక్షిణ భారత ఇన్చార్జ్, ధీరజ్ శర్మ జాతీయ అధ్యక్షుడు నేషనలిస్ట్ యూత్ కాంగ్రెస్ (ఎన్ సిపి) యష్ పా జాతీయ కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి (ఎన్.వై.సి ఎన్.సి.పి) పి.కె. నజేష్ కుమార్ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి వర్కింగ్ కమిటీ సభ్యుడు ఎన్.సి.పి సునీల్ జాదవ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ ఎన్.సి.పి పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొణక రామదాసు, రాజులపాటి ఐలయ్య, ముక్తి మల్లేష్, కోడెం సీతాకుమారి, పైథా సోము, కుంజ నాగేంద్రబాబు, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా మాజీ సిపిఐ కార్యదర్శి కాకాటి గోపయ్య 17 వ వర్ధంతి

**ఇల్లందు, మన భద్రాద్రి న్యూస్, మార్చి 28**

గోపయ్య స్తూపానికి పట్టణ కార్యదర్శి బంధం నాగయ్య పూలమాల వేసి నివాళులర్పించినారు. ఎస్కే వలి జెండా ఆవిష్కరణ చేసినారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ భాస శ్రీనివాస్ మాట్లాడుతూ కామ్రేడ్ గోపయ్య చేసిన సేవలను కొనియాడినారు. ఇందిరా నగర్ లో మంచినీటి సమస్య విద్యుత్ సమస్య రేషన్ కార్డుల కొరకు అనేక పోరాటాలు చేసినారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు కాకాటి భద్రమ్మ వారి కుమారులు ఎల్లెందర్ రమేష్ రమిత మాజీ సర్పంచ్ లలిత చింతల సరోజ నట్టా విజయ వీరారెడ్డి అంజయ్య గౌడ్ ఈర్ల రవి మారబోయిన గట్టయ్య రమేష్ అఫ్జల్ తదితరులు పాల్గొని కామ్రేడ్ గోపయ్యకు ఘనంగా నివాళులర్పించినారు.



# క్రైస్తవుల పై దాడులు అరికట్టాలి

**- పాస్టర్ ప్రవీణ్ మృతి పై విచారణ సమగ్రంగా నిర్వహించాలి**
**- బూర్గంపహాడ్ లో నిరసన ప్రదర్శన శాంతి ర్యాలీ**



బూర్గంపహాడ్, మన భద్రాద్రి బ్యూరో, మార్చి 28
క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, పాస్టర్ ప్రవీణ్ పగడాల హత్యకు కారకులైన వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆల్ పాస్టర్స్ అసోసియేషన్ బూర్గంపహాడ్ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో నిరసన కార్యక్రమం చేపట్టారు. అదేవిధంగా అంబేద్కర్ సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవుల ఐక్యత వర్ధిల్లాలి... క్రైస్తవుల పై దాడులు అరికట్టాలి అంటూ నినాదాలు చేశారు. వినతి పత్రాన్ని స్థానిక పోలీస్ స్టేషన్లో స్టేషన్ ఇన్చార్జికి అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ గత మూడు రోజుల క్రితం రాజమండ్రిలో ప్రవీణ్ ప్రగడాలపై గుర్తుతెలియని దుండగులు దాడి చేసి ప్రమాదంగా చిత్రీకరించడం దారుణమన్నారు. దాడికి పాల్పడిన వారిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు తగు చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు మెండి భాస్కర్, డి శ్రీను, తాటి మహేష్, డి పెద్దారావు, వి.ఆశీర్వాదం, శెట్టి జాన్సన్, జాన్ మార్క్, జాన్సన్, పాల్ అభిషేక్, ప్రసన్న కుమార్, ఆదినారాయణ, నవీన్, ఆమోస్, వేణు కుమార్, విశ్వాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

**– పిఆర్టియూ మండల అధ్యక్షులు ఎస్ శంకర్**



బూర్గంపహాడ్, మన భద్రాద్రి బ్యూరో, మార్చి 28
రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పిఆర్టియూ మండల అధ్యక్షులు ఎస్ శంకర్ అన్నారు. శుక్రవారం పిఆర్టి యూటిఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శాఖ ఇచ్చిన పిలుపులో పిఆర్టియూ మండల ఉపాధ్యాయులు తహసీల్దార్ ని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల పెండింగ్ జీపీఎఫ్, టిఎస్ ఎల్, ఎస్ఎల్ బిల్లులను విడుదల చేయాలని, డిఏ, పిఆర్సి ప్రకటించాలన్నారు. అదే విధంగా పొదిలి సత్యనారాయణ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. అనంతరం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియూ రాష్ట్ర మహిళా కార్యదర్శి కే పద్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి బాబురావు, వై ప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షులు టీ ఈశ్వర్, బి రామారావు, మండల మహిళా ఉపాధ్యక్షులు డి పదజ, కోశాధికారి బి రమేష్, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం టి కిషన్ రావు, వీరేశం, పిఆర్టియూ మండల ప్రధాన కార్యదర్శి ఎస్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా ఉగాది నుండి 1 44 కేంద్రాలలో ధాన్యం కొనుగోళ్లు

**–జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి బాబురావు**

చంద్రుగొండ, మన భద్రాద్రి న్యూస్, మార్చి 28



జిల్లావ్యాప్తంగా ఉగాది నుండి 144 కేంద్రాలలో వరి కొనుగోలు ప్రారంభమవుతాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి బాబురావు తెలిపారు. శుక్రవారం మండల లో పురుగుమందుల ఫెర్టిలైజర్ షాపుల ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని 17% తేమ ఉండే విధంగా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. సన్నాలకు 2320 రూపాయలతోపాటు ప్రభుత్వం 500 రూపాయలు బోనస్ ఇస్తుందని అదేవిధంగా దొడ్డు రకానికి 2,300 రైతులకు వారి వారి ఖాతాలో నాలుగు రోజుల్లో జమ అవుతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా యాసింగిలో వరి 65000 ఎకరాలలో మొక్కజొన్న 35000 ఎకరాలలో వేరుశనగ 1500 ఎకరా లలో మిర్చి 11,500 ఎకరాల లో సాగు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఆయిల్ ఫామ్ 70 వేల ఎకరాలలో సాగు చేస్తున్నారని ఎస్సీ ఎస్టీలకు 100% సబ్సిడీతో డ్రిప్ పట్టా భూమి ఉన్న దరఖాస్తు చేస్తున్న ప్రతి రైతుకు అందజేస్తున్నామన్నారు. బీసీలకు 90 శాతం సబ్సిడీ తో ఆయిల్ ఫామ్ సాగు చేసుకోవచ్చున్నారు. మునగ సాగు ఈజీఎస్ ద్వారా చేసుకుంటే ఎకరాకు సంవత్సరానికి ఒక లక్ష ఇరవై వేల రూపాయలు దఫాల వారీగా వారి బ్యాంకులో జమ అవుతాయని రైతులు సాగుకు ముందుకు రావాలన్నారు. ఈ సమావేశంలో మండల ఏవో వినయ్ పాల్గొన్నారు.

## తహసీల్దార్ కు వినతి పత్రం అందించిన ఉపాధ్యాయ సంఘాలు



టేకులపల్లి, మన భద్రాద్రి న్యూస్, మార్చి 28
పెండింగ్ జిపిఎఫ్ , టీఎస్ జిఎల్ ఐ ఎల్ ఎస్ బిల్లులు విడుదల చేయాలనీ మరియు డి ఎ పిఆర్ ప్రకటించాలని శుక్రవారం స్థానిక టేకులపల్లి తహసీల్దార్ నాగ భవాని కి పిఆర్టియు టేకులపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో మెమొరండం సమర్పించడం జరిగినది. ఈ సందర్భంగా పి ఆర్ టి యు టి ఎస్ టేకులపల్లి మండల శాఖ అధ్యక్షులు జి మోతిలాల్ మాట్లాడుతూ ఆదాయం పన్ను చెల్లించి దాచుకున్న సొమ్మును తిరిగి తీసుకొనుటకు నెలలు,సంవత్సరాలు,పడుతుంది అని ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రావాలంటే హైకోర్టులకు వెళ్లి మా సొమ్మును మాకు తిరిగి ఇప్పించాలని విజ్ఞప్తి చేయవలసిన దుస్థితి ఏర్పడిందని తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో పిఆర్టియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బి ఎం విజయనిర్మల , జిల్లా ఉపాధ్యక్షులు టి రవీందర్ మండల అధ్యక్షులు మోతిలాల్ , ప్రధాన కార్యదర్శి బి. రమేష్ బాబు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు బి. బాలు గారు పి ఆర్ టి యు నాయకులు బి హతిరం మూడు రమణ బి.శంకర్.%జ౬% మురళి ధర్రావు, వెంకటరెడ్డి, రవీందర్, ఆర్టిడి, సీఐ శ్రీ జరా బిక్ష%శీ%, మండలంలోని ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు ఈ నిరసన కార్యక్రమాలలో పాల్గొన్నారు.

## ఇల్లందులో పవన్ కళ్యాణ్ మూవీ షూటింగ్





ఇల్లందు, మన భద్రాద్రి న్యూస్, మార్చి 28
సింగరేణి జేకే 5 ఓసీలో పవన్ కళ్యాణ్ నటిస్తున్న హరిహర వీరమల్లు షూటింగ్ జరిగింది. సినిమాలోని పలు సన్నివేశాలను ఇక్కడ చిత్రికరించారు. చిత్ర యూనిట్ సభ్యులతో సింగరేణి ప్రాంగణమంతా కోలహాలం నెలకొంది. సింగరేణి యాజమాన్యం షూటింగ్‌ను పర్యవేక్షించింది.

## పీఆర్టీయూటీఎస్ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పణ



గుండాల, మన భద్రాద్రి న్యూస్, మార్చి 28
పీఆర్టీయూటీఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇచ్చిన పిలుపులో భాగంగా మండల తహసీల్దార్ కు మండల పీఆర్టీయూటీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం వినతి పత్రాన్ని సమర్పించారు. పెండింగ్ లో ఉన్న జీపీఎఫ్, టీఎస్జీఎల్ఐ, ఎస్ఎల్ బిల్లులు విడుదల చేయాలని, డీఏ, పీఆర్సీ ప్రకటించి, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని, పొదిలి సత్యనారాయణ కుటుంబాన్ని ఆదుకోవాలని మండల అధ్యక్షులు వీ వీరాస్వామి, ప్రధాన కార్యదర్శి ఎన్ ప్రసాద్, తదితర సభ్యులు డిమాండ్ చేశారు.

## దలసరి వీరస్వామి కి నివాళులర్పించిన కోరం సురేందర్

టేకులపల్లి, మన భద్రాద్రి న్యూస్, మార్చి 28
టేకులపల్లి మండలం కుంటల్ల గ్రామ పంచాయతీ ఎర్రబోడు గ్రామానికి చెందిన దనసరి వీరస్వామి స్వర్గస్థులు కావడంతో వారి భౌతికయానికి నివాళులు అర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియచేసిన ఇల్లందు నియోజకవర్గ నాయకులు కోరం సురేందర్. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పోషాలు, భూక్యా సర్దార్, కిషన్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు




**భద్రాచలం, మన భద్రాద్రి బ్యూరో, మార్చి 28**

భద్రాచలం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు బొమ్మిశెట్టి శ్రీలక్ష్మి, (60,000), కాపుల రాజమ్మ (60,000), పిన్నింటి అప్పల నాయుడు (60,000), పణెం షర్మిల (30,000) లకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సంబంధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఐఆర్సీటీసీ స్పెషల్ ప్యాకేజీ తో హాయిగా శ్రీవారి దర్శనం..!




**హైదరాబాద్, మన భద్రాద్రి బ్యూరో, మార్చి 28**

తిరుమల శ్రీవారి దర్శనం కోసం భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. సాధారణంగా, ప్రత్యేక దర్శన టిక్కెట్లు ముందుగానే బుక్ చేసుకోవాల్సిన పరిస్థితి ఉండటంతో, అనేక మంది భక్తులు వెంటనే వెళ్లాలనుకున్నప్పుడు టిక్కెట్లు దొరకక ఇబ్బందిపడుతున్నారు. అయితే, ఈ సమస్యకు పరిష్కారంగా భారతీయ రైల్వే క్యాటరింగ్ %ఴ% టూరిజం కార్పొరేషన్ (ఐఆర్సీటీసీ) భక్తుల కోసం తిరుపతి బై వెంకటాద్రి ఎక్స్ప్రెస్ అనే ప్రత్యేక టూర్ ప్యాకేజీని ప్రకటించింది. ఈ ప్యాకేజీ ద్వారా హైదరాబాద్ నుండి తిరుమల శ్రీవారి దర్శనం తో పాటు కాళహస్తి, తిరుచానూరు పుణ్యక్షేత్రాలను కూడా సందర్శించే అవకాశం లభిస్తుంది. ఇది మొత్తం మూడు రోజుల పాటు సాగుతుంది. మరిన్ని వివరాలు ఇప్పుడు చూద్దాం.

**- ప్యాకేజీ షెడ్యూల్ ఇలా..**

మొదటి రోజు - హైదరాబాద్ నుంచి తిరుపతి ప్రయాణం రాత్రి 8:05 గంటలకు కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి వెంకటాద్రి ఎక్స్ప్రెస్ (12797) బయలుదేరుతుంది. రాత్రంతా రైలు ప్రయాణం. మరుసటి రోజు ఉదయం 07:05 గంటలకు తిరుపతి చేరుకుంటారు.రెండో రోజు - తిరుచానూరు మరియు శ్రీకాళహస్తి దర్శనం తిరుపతి రైల్వే స్టేషన్ చేరుకున్న వెంటనే ఐఆర్సీటీసీ ఏర్పాట్లు చేసిన హోటల్ కు భక్తులను తీసుకెళ్తారు. ఫ్రెషప్ అయిన అనంతరం తిరుచానూరు పద్మావతి అమ్మవారి దర్శనం. మధ్యాహ్నానికి శ్రీకాళహస్తి చేరుకుని కాళహస్తీశ్వర స్వామిని దర్శించుకునే అవకాశం. తిరిగి తిరుపతికి వచ్చి హోటల్ లో బస. మూడో రోజు - తిరుమల శ్రీవారి దర్శనం, తెల్లవారు జామునే హోటల్ నుంచి బయలుదేరి తిరుమల వెళ్లాలి. ఉచిత దర్శనం క్యూలైన్ ద్వారా శ్రీవారి దర్శనం తిరిగి తిరుపతి లోని హోటల్కు చేరుకోవాలి. సాయంత్రం హోటల్ చెకౌట్ చేసి తిరుపతి రైల్వే స్టేషన్ కు చేరుకోవాలి. రాత్రి 8:00 గంటలకు తిరిగి వెంకటాద్రి ఎక్స్ప్రెస్ (12798) ద్వారా హైదరాబాద్ బయలుదేరతారు. నాలుగో రోజు - తిరుగు ప్రయాణం రాత్రంతా ప్రయాణం చేసి ఉదయం 06:20 గంటలకు కాచిగూడ రైల్వే స్టేషన్కు చేరుకోవడం ద్వారా టూర్ ముగుస్తుంది.

-ప్యాకేజీ ధర మరియు ఎంపికలు

ఐఆర్సీటీసీ ఈ ప్యాకేజీని కంఫర్ట్ మరియు స్లీపర్ క్లాస్ లో అందుబాటులోకి తీసుకువచ్చింది. కంఫర్ట్ క్లాస్ (3 ఏసీ) సింగిల్ షేరింగ్ - ₹13,810, డబుల్ షేరింగ్ - ₹10,720, ట్రిపుల్ షేరింగ్ - ₹8,940, స్లీపర్ క్లాస్ సింగిల్ షేరింగ్ - ₹12,030, డబుల్ షేరింగ్ - ₹8,940, ట్రిపుల్ షేరింగ్ - ₹7,170 ప్రత్యేకంగా నడిచే వెంకటాద్రి ఎక్స్ప్రెస్ (12797/12798) ద్వారా రైలు ప్రయాణం. ఎక్కడి నుంచి కాచిగూడ రైల్వే స్టేషన్, హైదరాబాద్, నుండి తిరుమల - తిరుచానూరు - శ్రీకాళహస్తి, ప్యాకేజీ మొత్తం వ్యవధి- మూడు రాత్రులు, రెండు పగళ్లు ముందస్తు టికెట్ అవసరం లేకుండా శ్రీవారి దర్శనం, కంఫర్ట్ మరియు స్లీపర్ క్లాస్ ఎంపికలు, ప్రత్యేక హోటల్ బస మరియు భోజన ఏర్పాట్లు.

- ఎలా బుక్ చేసుకోవాలి..?

టూర్ ప్రారంభం- 2025 మార్చి 29, బుకింగ్ లింక్: www.irctctourism.com, కస్టమర్ కేర్ నంబర్- 1800-110-139 టికెట్లు ముందుగానే బుక్ చేసుకోవాలి. పిల్లలకు తక్కువ ధరలో టికెట్లు లభిస్తాయి. భక్తులు ఒకరు కన్నా ఎక్కువ మంది కలిసి టూర్ బుక్ చేస్తే ప్రత్యేక తగ్గింపులు లభిస్తాయి. తిరుమల శ్రీవారి భక్తుల కోసం ఇలాంటి ప్రత్యేక ప్యాకేజీలు మరింత ఉపయుక్తంగా ఉంటాయి. అనుకున్న వెంటనే దర్శనం పొందే అవకాశం ఇస్తున్న ఈ టూర్ ప్యాకేజీ భక్తుల కోసం గొప్ప అవకాశమనే చెప్పాలి. హైదరాబాద్, తెలంగాణ ప్రాంతాల నుంచి తిరుమల ప్రయాణించే భక్తులు ఈ ప్యాకేజీ ద్వారా ఎంతో తక్కువ ఖర్చులో అద్భుతమైన యాత్రను అనుభవించవచ్చు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకృతిని నాశనం చేస్తుంది

ఈ భూముల విక్రయం వల్ల హైదరాబాదు లోని పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని కేటీఆర్ తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చేసిన ప్రకటనను ఆయన తప్పుబట్టారు. ముఖ్యంగా, 'ఈ భూమిలో ఎటువంటి జంతువులు లేవని' చేసిన వ్యాఖ్యలను తప్పుడు సమాచారంగా పేర్కొన్నారు.'హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్సీయూ) పరిసర ప్రాంతాల్లో 700కు పైగా రకాల వృక్ష జాతులు, అనేక రకాల జంతువులు, సరీసృపాలు, 200కు పైగా పక్షి జాతులు నివసిస్తున్నాయి. అంతేకాదు, అక్కడి శిలా నిర్మాణాలు కోటి సంవత్సరాల చరిత్రను కలిగి ఉన్నాయి,' అని కేటీఆర్ వివరించారు.

**పర్యావరణానికి ముప్పు**

ఈ భూములను విక్రయించడం వల్ల నగరంలోని పచ్చదనానికి పెద్ద ముప్పు వాటిల్లుతుందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే హైదరాబాద్లో కాంక్రీటీకరణ పెరిగి, గ్రీన్ కవరేజీ తగ్గిపోతున్న నేపథ్యంలో, మరింత పచ్చదనం కోల్పోతే భవిష్యత్ తరాలకు ప్రమాదకర పరిస్థితులు తలెత్తుతాయని చెబుతున్నారు.

'ప్రకృతి సంరక్షణ కోసం శ్రమిస్తామంటున్న ప్రభుత్వం, వాస్తవానికి పర్యావరణాన్ని నాశనం చేసే చర్యలకు పాల్పడుతోంది. ఈ భూములను షాపింగ్ మాల్స్, వాణిజ్య భవనాల కోసం వినియోగించేందుకు ప్రయత్నించడం నగర భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తుంది,' అని కేటీఆర్ మండిపడ్డారు.

**- - బీఆర్ఎస్ హయాంలో పర్యావరణ పరిరక్షణ**

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పర్యావరణ పరిరక్షణ కోసం అనేక చర్యలు తీసుకున్నట్లు కేటీఆర్ గుర్తు చేశారు. హరితహారం, అర్బన్ ఫారెస్ట్ అభివృద్ధి వంటి కార్యక్రమాలు చేపట్టి, పచ్చదనం పెంపొందించేందుకు విశేష కృషి చేశామని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అభివృద్ధి పేరుతో పర్యావరణ పరిరక్షణను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ఈ భూముల విక్రయ నిర్ణయం వెనుక ప్రభుత్వ నిజమైన ఉద్దేశ్యాలను ప్రశ్నించాల్సిన అవసరం ఉందని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. అభివృద్ధి అంటే కేవలం భవనాలు నిర్మించడం మాత్రమే కాదని, భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన పర్యావరణాన్ని అందించడమని ఆయన స్పష్టం చేశారు. 'ఈ భూములను ప్రభుత్వ ప్రయోజనాలకు వినియోగించకుండా, ప్రైవేట్ పార్టీలకు అప్పగించాలనుకోవడం వెనుక ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలు దాగున్నాయో తెలియాల్సిన అవసరం ఉంది,' అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ భూముల అమ్మకంపై సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. పర్యావరణ ప్రేమికులు, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ భూముల అమ్మకాన్ని నిలిపివేయాలని పౌరులు డిమాండ్ చేస్తున్నారు. బీఆర్ఎస్ నేతలు కూడా దీని వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధమవుతున్నారు. ప్రజలు కూడా ఈ అంశంపై చైతన్యం కలిగి, పచ్చదనం కాపాడేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు.

# మాడవీధుల విస్తరణలో భూములు కోల్పోయిన కుటుంబాలకు చెక్కులు అందజేత



**భద్రాచలం, మన భద్రాద్రి బ్యూరో, మార్చి 28**

భద్రాచలం లోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం మాడవీధుల విస్తరణ కింద భూములు కోల్పోయిన కుటుంబాలకు శుక్రవారం రోజున ఆర్డీవో కార్యాలయంలో చెక్కులను ఆర్డీవో దామోదర్ రావు అందజేయడం జరిగింది. మొత్తం 40 కుటుంబాలకు 34 కోట్ల 45 లక్షల 86 వేల 439 రూపాయలను ఆ కుటుంబాలకు అందజేశారు. శుక్రవారం 17 కుటుంబాల వారు 10 కోట్ల 82 లక్షల రూపాయల చెక్కులను అందుకున్నారు. మిగతా వారికి ఈరోజు లోగా అందించడం జరుగుతుందని ఆర్డిఓ దామోదర్ రావు తెలిపారు.

# మారుమూల ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు





**భద్రాచలం, మన భద్రాద్రి బ్యూరో, మార్చి 28**

భద్రాచలంలో ఆర్టీసీ బస్టాండ్ నందు ఉగాది పండుగ సందర్భంగా గిరిజన మారుమూల ప్రాంతాలు తునికి చెరువు, చెరుపల్లి, ఆర్లగూడెం, మారాయి గూడెం మీదగా లక్ష్మీనగరం వెళ్లేందుకు బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేసి "బస్సు"ను రిబ్బన్ కట్ చేసి జెండా ఊపి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రారంభించారు.అనంతరం టికెట్ తీసుకొని బస్సులోని ప్రయాణం చేశారు. గిరిజన మారుమూల ప్రాంత ప్రజలకు ప్రతిరోజు బస్సు సౌకర్యం అందుబాటులో ఉన్నందున, వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# లక్షా ఇరువై వేలకు సంత వేలం

**గుండాల, మన భద్రాద్రి న్యూస్, మార్చి 28**

మండల కేంద్రంలో ప్రతీ మంగళవారం నిర్వహించే వారాతపు సంత లక్షా ఇరువై వేలకు ఈసం ఎర్రయ్య జగ్గాయ్ గూడెంకు చెందిన వ్యక్తి కైవసం చేసుకున్నాడు...

# ఆదివాసీలకు అన్యాయం జరిగింది

**గుండాల, మన భద్రాద్రి న్యూస్, మార్చి 28**



శుక్రవారం జరిగిన వారంతపు సంత వేలం పాటలో ఆదివాసీలకు అన్యాయం జరిగిందని ఆదివాసీలు ఆరోపిస్తున్నారు. ఈ వేలం పాట ఏకపక్షంగా జరిగిందని వారు విమర్శలు గుప్పిస్తున్నారు. ఎవరికి తెలియకుండా సంత వేలం నిర్వహించారని, మాకు తెలిస్తే మేము కూడా పాల్గొనే వాళ్ళమని వాపోతున్నారు. మళ్లీ వేలం పాట నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. ఆదివాసీలకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని ఈసం ఉదయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.